సాక్షి
కర్నూలు
శనివారం । 5 । ఏప్రిల్ । 2025



వారికి తీరిక లేదు..

కస్తూర్బా విద్యా నిలయాల్లో కొత్తగా చేరిన ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు అందడం లేదు. జాబితాపై ఇన్‌చార్జ్ మంత్రుల సంతకాలు చేయడం జాప్యం అవుతోంది. 8లో▸



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ఊయలసేవ నిర్వహించారు.



ఎస్‌ఐలుగా పదోన్నతి

కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 29 హెడ్ కానిస్టేబుళ్లకు, 15 మంది క్లర్కులకు పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్ కాపీ ఇచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఆరోగ్య బీమా

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎంజేఏవై (ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన) వయో వందనలో భాగంగా 70 ఏళ్ల దాటిన వయో వృద్ధులకు రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమాను వర్తింపజేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్ 02వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మొబైల్ ఫోన్ అప్లికేషన్ (ఆయుష్మాన్ యాప్) లేదంటే వైబ్‌సైట్ పోర్టల్ beneficiary.nha.gov.inతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయుష్మాన్ కార్డుల జారీకి ఆధార్ ఆధారిత ఈ–కేవైసీ తప్పనిసరి తెలిపారు. వన్‌టైం ఆప్షన్ ద్వారా ఈ పథకంలో చేరేందుకు అవకాశాన్ని కల్పిస్తారని పేర్కొన్నారు.

50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు 2025–26 సంవత్సరానికి సంబంధించి 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు అందజేయనున్నట్లు ఏపీఎంఐపీ అధికారులు తెలిపారు. అలాగే ఐదు ఎకరాలలోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఇందులో కేంద్రప్రభుత్వం వాటా 33 శాతం ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం 67 శాతం భరిస్తుందని తెలిపారు. ఇతర సన్న, చిన్నకారు రైతులకు ఐదు ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్యం కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాలు నేరం

- ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల



చైల్డ్ హెల్ప్‌లైన్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కర్నూలు(అర్బన్): బాల్య వివాహాలు చేయడం నేరమని, చట్టం ప్రకారం రూ.లక్ష జరిమానాతో పాటు రెండు సంవత్సరాల శిక్ష ఉంటుందని ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల పేర్కొన్నారు. బి.క్యాంప్‌లోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని 102 సచివాలయాల మహిళా పోలీసులు, అర్బన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి సచివాలయంలో మహిళా పోలీసులను నియమించారన్నారు. అర్బన్ సీడీపీఓ అనురాధ మాట్లాడుతూ.. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యలు వస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి తెలియజేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి టి.శారద అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీసీపీయూ సిబ్బంది శ్వేత, కీర్తి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీబీసీడబ్ల్యూఈఓగా కె.ప్రసూన



కర్నూలు(అర్బన్): జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణిగా కె.ప్రసూనను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలో సహాయ బీసీ సంక్షేమాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రసూనకు డీబీసీడబ్ల్యూఈఓగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలుకు నియమించారు. ఇక్కడ రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఈఓగా విధులు నిర్వహించిన పి.వెంకటలక్ష్మమ్మను నెల్లూరుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీబీసీడబ్ల్యూఈఓగా వ్యవహరించారు. ప్రసూన ఈ నెల 7, 8 తేదీల్లో ఇక్కడ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

డైట్ కాలేజీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ప్రభుత్వ డైట్ కాలేజీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఫారిన్ సర్వీస్ కింద డిప్యూటేషన్ ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఖాళీల వివరాలు www.deokml13.blogspot.comలో చూసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తును హెచ్‌ఎం, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలతో ధ్రువీకరించి, బి.తాండ్రపాడులోని ప్రభుత్వ డైట్ కాలేజీలో అందజేయాలన్నారు.

మానవత్వం కుళ్లిపోయి.. మరణం ముక్కుమూసుకొని!

ఎన్నో సమస్యలతో.. ప్రమాదాల బారిన.. దిక్కులేని స్థితిలో మరణిస్తే, ఆ తర్వాత కూడా మరో చావు కళ్ల ముందు కనిపిస్తోంది. ఇంతటితో విముక్తి పొందినాం అనుకునేందుకు వీలులేకుండా ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. అందరినీ దుఃఖసాగరంలో ముంచిపోయాం అనే బాధకంటే.. చచ్చినా ఏడుపు తప్పలేదనే బాధ 'చివరి'కి మిగులుతోంది. మృతదేహాలకు కనీస మర్యాద లేకపోవడం.. అంతిమ సంస్కారాలు ఆలస్యమవడం చూస్తే, చచ్చినా చావే అంటే ఇదే కాబోలు అనిపిస్తుంది. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో 'మరణ' వేదన ఇది..!

జీజీహెచ్ మార్చురీలో పనిచేయని ఫ్రీజర్లు

- రోజూ ఆరు నుంచి పది మృతదేహాలకు పోస్టుమార్టం
- నెలలో ఐదు వరకు అనాథ మృతదేహాలు
- ఫ్రీజర్‌లు లేకపోవడంతో కుళ్లుతున్న శవాలు
- మార్చురీ చుట్టుపక్కల భరించలేని దుర్గంధం
- ఎవరికీ పట్టని మార్చురీ నిర్వహణ

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు చుట్టుపక్క జిల్లాల్లో ఎక్కడ ప్రమాదాలు, ఆత్మహత్యలు చేసుకున్నా పోస్టుమార్టం కోసం కర్నూలు మార్చురీకే తీసుకొస్తారు. ప్రతిరోజూ ఆరు నుంచి 10 వరకు మృతదేహాలకు ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తారు. ఇందుకు ఆరు నుంచి 32 గంటల సమయం పడుతుంది. ఘటన జరిగిన ప్రాంతానికి సంబంధించిన పోలీసులు వచ్చి పంచనామా చేసి ఆ నివేదికను ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యులకు ఇస్తే అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగిస్తారు. పోస్టుమార్టం నిర్వహించేంత వరకు మృతదేహాలు కుళ్లిపోకుండా ఉండేందుకు వాటిని బాడీ ఫ్రీజర్లలో భద్రపరుస్తారు. నెలకు నాలుగు నుంచి ఆరు అనాథ మృతదేహాలను వీటిలోనే ఉంచుతారు. మార్చురీలో ఒక వాక్ ఇన్ కూలర్ ఉంది. అందులో 10 నుంచి 15 మృతదేహాలను భద్రపరచవచ్చు. ఇది కాకుండా మూడు బాడీ ఫ్రీజర్లు ఉండగా.. 18 మృతదేహాలను ఉంచవచ్చు. కానీ ప్రస్తుతం ఇవన్నీ పనిచేయని పరిస్థితి. వాక్ ఇన్ కూలర్ ఏడాది కాలంగా పనిచేయడం లేదు. ఒక బాడీ ఫ్రీజర్ రెండు నెలలుగా, మరో బాడీ ఫ్రీజర్ 15 రోజులుగా, ఇంకో బాడీ ఫ్రీజర్ రెండు రోజులుగా పనిచేయడం లేదని తెలుస్తోంది.



మార్చురీలో మూలనపడిన బాడీ ఫ్రీజర్లు

శవాలు కుళ్లికంపుకొడుతున్నాయి

మార్చురీలో వాక్ ఇన్ కూలర్, బాడీ ఫ్రీజర్లు పనిచేయకపోవడంతో వాటిని మూలనపడేశారు. దీంతో మార్చురీకి వచ్చిన మృతదేహాలను సెప్టిక్ మార్చురీలో ఉంచుతున్నారు. దాదాపుగా మెడికో లీగల్ కేస్ మృతదేహాలన్నింటికీ 24 గంటల్లోపు పోస్టుమార్టం పూర్తవుతుంది. సుదూర ప్రాంతాల నుంచి పోలీసులు రావాల్సి ఉన్న పరిస్థితిలో 36 నుంచి 48 గంటల సమయం పడుతుంది. ఈ క్రమంలో మృతదేహాలు కుళ్లిపోతున్నాయి.



మూతపడిన వాక్ ఇన్ కూలర్ గది

అటువైపు వెళ్లాలంటే నరకం

చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం చేయించుకుని తీసుకెళ్లేందుకు వచ్చిన కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో పాటు పంచనామా చేయడానికి వచ్చిన పోలీసులతో మార్చురీ నిత్యం కిటకిటలాడుతుంది. ప్రస్తుతం మార్చురీ కుళ్లిన కంపు వాసన వస్తుండటంతో వారు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ దుర్వాసన మరింత ఎక్కువ అవుతోంది. పోస్టుమార్టం ముగిసి మృతదేహాన్ని తీసుకెళ్లేంత వరకు ఈ నరకం తప్పడం లేదు.

అనాథ మృతదేహాలకు దిక్కేలేదు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు చుట్టుపక్క ప్రాంతాల నుంచి మార్చురీకి అనాథ మృతదేహాలు ప్రతి నెలా నాలుగు నుంచి ఆరు దాకా వస్తుంటాయి. నిబంధనల మేరకు వీటిని కుటుంబసభ్యుల కోసం మూడు రోజుల పాటు మార్చురీలో ఉంచి ఆ తర్వాత అనాథ మృతదేహాలుగా పరిగణించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఈ మేరకు గతంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఒక వ్యక్తి కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. ఒక్కో అనాథ మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు రూ.1000 చొప్పున చెల్లిస్తారు. అయితే ఒక్కో మృతదేహం తీసుకెళ్తే గిట్టుబాటు కావడం లేదని.. ఒకేసారి మూడు, నాలుగు అనాథ మృతదేహాలు తోడయ్యాక తీసుకెళ్తున్నారు. ఈ కారణంగా వాటిని తీసుకెళ్లేందుకు నెలరోజుల సమయం పడుతోంది. అప్పటి వరకు మార్చురీలో శవాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. కొన్నిసార్లు పురుగులు పట్టిపోతుండటం గమనార్హం.

ఎవ్వరికీ పట్టని మార్చురీ

- మృతదేహాలు ప్రభుత్వాసుపత్రి నుంచి వస్తాయి.
- మార్చురీ సైతం ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఉంది.
- పోస్టుమార్టం నిర్వహించేది మాత్రం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం వైద్యులు.
- ఈ కారణంగా మార్చురీ నిర్వహణ ఎవరు చేయాలన్నది కొన్ని దశాబ్దాలుగా అంతుబట్టడం లేదు.
- ఫలితంగా మార్చురీలో మృతదేహాలను పోస్టుమార్టంకు సిద్ధం చేసేందుకు అవసరమైన సహాయకుల పోస్టులు మంజూరు కాని పరిస్థితి.
- ప్రస్తుతం అనధికారికంగా ముగ్గురు వ్యక్తులు సహాయకులుగా పనిచేస్తున్నారు.
- వీరికి జీతాలను వైద్యులే సమకూరుస్తున్నారు.

పోస్టుమార్టం నిర్వహించడమే మా పని



మార్చురీకి వచ్చిన మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడమే ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుల బాధ్యత. మార్చురి నిర్వహణ అంతా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ చూసుకోవాలి. అయినా వాక్ ఇన్ కూలర్ రిపేరికి చర్యలు తీసుకున్నాం. రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తుంది.
– డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రిన్సిపల్, కేఎంసీ, కర్నూలు

ఫోరెన్సిక్ మెడిసిన్ పరిధిలోనే మార్చురీ



మార్చురీ వ్యవహారమంతా కర్నూలు మెడికల్ కాలేజీలోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం పరిధిలోనే ఉంటుంది. నిర్వహణ బాధ్యత పూర్తిగా వారిదే. మాకు సంబంధం లేదు. బాడీ ఫ్రీజర్లు, వాక్ ఇన్ కూలర్లు పనిచేయించేందుకు ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడితో మాట్లాడి పరిష్కరిస్తా.
– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

'ఈ–శ్రమ్'తో అసంఘటిత కార్మికుల గుర్తింపు

- కార్మికుల పేర్లను నమోదు చేయాలి
- ఏపీ ప్రభుత్వ కార్మిక శాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు



సమావేశానికి హాజరైన కార్మిక శాఖ అధికారులు, సంఘాల నాయకులు



మాట్లాడుతున్న గంధం చంద్రుడు

కర్నూలు(అర్బన్): అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పేర్లను ఈ– శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఏపీ ప్రభుత్వ కర్మాగార, బాయిలర్స్, బీమా, మెడికల్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన కార్మిక శాఖ ఉప కమిషనర్లు, సహాయ కమిషనర్లు, సహాయ కార్మిక శాఖ అధికారులు, ఫ్యాక్టరీల యజమానులు, సీఐటీయు, ఏఐటీయుసీ కార్మిక సంఘాల నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం చంద్రుడు మాట్లాడుతూ ఏదైనా సంస్థలో పది కంటే ఎక్కువ మంది కార్మికులు పని చేస్తుంటే, వారి నెల జీతం రూ.21 వేల లోపు ఉంటే ఈఎస్‌ఐ చట్టం కింద పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్మిక, కర్మాగారాల, బీమా, మెడికల్ సర్వీసెస్ శాఖల సమన్వయంతో అర్హత ఉన్న కార్మికుల పేర్లను రాబోవు రెండు నెలల్లో పేర్లను నమోదు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు పని చేస్తుంటే వారికి చట్ట ప్రకారం రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, కర్మాగారాల్లో పనిచేసే మహిళలకు కనీసం మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి కర్మాగారాలను గుర్తించి మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కర్నూలు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ యం బాలునాయక్, విజయవాడ సంయుక్త కమిషనర్లు ఎస్ లక్ష్మినారాయణ, ఏ గణేషన్, సహాయ కార్మిక కమిషనర్ ఆదినారాయణ, ఉమ్మడి నాలుగు జిల్లాల ఉప కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీకి పాత భవనాలు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి కర్నూలులోని ఫర్‌మెన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాత భవనాలు కేటాయించారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రూసా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త ఆదేశాలు జారీ చేశారు. ఉర్దూ వర్సిటీకి ప్రభుత్వ భవనాలను కేటాయించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. ఎస్. షావలి ఖాన్ లేఖ రాశారు. దీంతో రూసా నిధులతో నిర్మించిన నూతన భవనాల్లోకి ఫర్‌మెన్ కళాశాలను మార్చుకొని పాత భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే అందులో ఎలాంటి సమయం లేకపోవడంతో వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ మరలా ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో ఈనెల చివరిలోగా ఉర్దూ వర్సిటీకి పాత బిల్డింగ్స్‌ను అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు.

జీవం పోసి.. జీవితం చాలించి!

- పేదరికంతో గర్భిణికి అందని పౌష్టికాహారం
- బిడ్డకు జన్మనిచ్చి తనువుచాలించిన మహిళ



ఆసుపత్రిలో మృతి చెందిన నాగేంద్రమ్మ

కోసిగి: పేదరికం ఆమె పాలిట శాపంగా మారింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చినా ఆమె బతకలేకపోయారు. కనీసం బిడ్డను చూడకుండానే మృతిచెందారు. ఈ దుర్ఘటన కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ (22)తో ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామానికి చెందిన హెబ్బటం రమేష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. మెదటి కాన్పు నిమిత్తం ఆమె ఐదో నెల క్రితం పుట్టినిల్లు డి.బెళగల్ గ్రామానికి వెళ్లారు. తల్లిదండ్రులు పేదలు కావడంతో బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. పుంటింట్లో ఆమె తోడుగా తమ్ముడు మాత్రమే ఉండేవారు. ఆమెకు సరైన పోషకాహారం అందేది కాదు. గర్భంతో ఉన్నా ప్రతి రోజూ ఆమె కూలి పనులకు వెళ్లేవారు. ఇటీవల జరిగిన ఉగాది పండుగకు తల్లిదండ్రులు ఇంటికి వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున నాగేంద్రమ్మకు పురిటి నొప్పులు రావడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. సురక్షిత కాన్పు జరిగి మగ శిశువుకు ఆమె జన్మిచ్చింది. కాన్పు వెంటనే ఆమెకు ఫిట్స్ రావడంతో కోలుకోలేక మృతి చెందినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. బిడ్డ ముఖం చూడకుండా తల్లి మృతిచెందడంలో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమైయ్యారు. ఆమె మృతదేహాన్ని సంతెకుడ్లూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

అకాల వర్షం.. అపార నష్టం





మహానంది మండలం తిమ్మాపురంలో నేలవాలిన అరటిచెట్లు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో వరిచేనులో వర్షపు నీరు చూపుతున్న రైతు

- 5 వేల హెక్టార్లలో దెబ్బతిన్న వరి
- అధికార అంచనా 2,158 హెక్టార్లు మాత్రమే
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నేలకొరిగిన అరటి తోటలు
- పాడైపోయిన మిర్చి, ఉల్లి పంటలు
- రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందేనా?

కర్నూలు(అగ్రికల్చర్)/ నంద్యాల (అర్బన్): పొలంలో చేతికొచ్చిన పంటలు నీటమునిగాయి. కల్లాల్లో అమ్మకానికి ఉంచిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కాయలతో కళకళలాడుతూ ఉండే అరటి, మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. పసుపు పంట పూర్తిగా పనికిరాకుండా పోయింది. అకాల వర్షంతో రైతుల రెక్కల కష్టం నేలపాలైంది. అన్నదాతల్లో ధైర్యం తొలగి దైన్యమే మిగిలింది. గురువారం మధ్యాహ్నం నుంచి మొదలైన అకాల వర్షాల ప్రభావం శుక్రవారం ఉదయం వరకు కొనసాగింది. ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కురిసిన అకాల వర్షాలతో మిర్చి, ఉల్లి, అరటి, వరి, మినుము పంటలకు అపార నష్టం వాటిల్లింది.

ఏ పంటలు ఎలా దెబ్బతిన్నాయంటే..

- కర్నూలు జిల్లాలో కోడుమూరు, సి.బెళగల్, గోనెగండ్ల, చిప్పగిరి మంత్రాలయం తదితర ప్రాంతాల్లో మిర్చి చివరి దశలో ఉంది. పలు ప్రాంతాల్లో రైతులు మిర్చిని పొలాల్లోనే ఆరబెట్టుకున్నారు. ఊహించని విధంగా వర్షాలు పడటంతో మిర్చి పంట పూర్తిగా తడిచిపోయింది.
- ఇటీవలి వరకు ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉండటంతో లేట్ రబీలో ఈ పంట ఎక్కువగా సాగు చేశారు. కోసి ఆరబెట్టిన ఉల్లిని వర్షాలు తడిపేశాయి.
- గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎమ్మిగనూరు మండలంలో అరటి భారీగా నేల కూలింది. అయితే ఉద్యాన అధికారులు 5 హెక్టార్లలోనే అరటి దెబ్బతిన్నట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు.
- సి.బెళగల్ మండలంలో మునగ, కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి. అయితే అధికారులు మాత్రం మునగ ఒక హెక్టారు, కూరగాయల పంటలు ఒక హెక్టారులో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా తేల్చారు. వ్యవసాయ పంటలకు ఎటువంటి నష్టం లేదని ప్రకటించారు.
- నంద్యాల జిల్లాలో రబీ సీజన్‌లో వరి ఎక్కువగా సాగైంది. ప్రస్తుతం పాల కంకి దశలో ఉంది. బండిఆత్మకూరు, గడివేముల, మహానంది, వెలుగోడు మండలాల్లో 5 వేల హెక్టార్లలో వరి దెబ్బతినింది. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం 2,158 హెక్టార్లు అని గుర్తించారు. అలాగే మినుము 10 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా తేల్చారు.
- నంద్యాల జిల్లాలో అరటి కూడా భారీగా దెబ్బతినింది. సంజామల మండలంలోని నొస్సం, గిద్దలూరు, రామభద్రునిపల్లి గ్రామాల్లో అరటి తోటలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాలు, గాలి తీవ్రతకు అరటి తోటలు నేల కూలాయి. ఉద్యాన అధికారులు 16.8 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో మామిడి ఈ సారి నిరాశాజనకంగా ఉంది. అంతంతమాత్రం ఉన్న కాపు గాలుల తీవ్రత, వర్షాలుకు నేల రాలిపోయింది. బేతంచెర్ల, ఓర్వకల్లు, ప్యాపిలి, డోన్, గోనెగండ్ల, సి.బెళగల్ తదితర మండలాల్లో పెనుగాలులకు మామిడి చెట్లు, కాయలు నేల రాలాయి. అయినా ఉద్యానశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం వివరాలు (మి.మీ)..

మండలం	వర్షపాతం
వెలుగోడు	56.8
కోడుమూరు	46.4
నందికొట్కూరు	46.2.
సి.బెళగల్	37.8
బండిఆత్మకూరు	37.0
సంజామల	30.6
మిడుతూరు	26.4
మహానంది	25.2
కొలిమిగుండ్ల	24.2
గోనెగండ్ల	24.2
కర్నూలు అర్బన్	23.6
చిప్పగిరి	22.8
ప్యాపిలి	22.4



ఉయ్యాలవాడ మండలం అల్లూరులో మిరప దిగుబడులపై కప్పిన పట్టలపై చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు

నష్ట పరిహారం అందేనా?

రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం.. అన్నదాతలకు ఎటువంటి చేయూత ఇవ్వడం లేదు. 2023 ఖరీఫ్, 2023–24 రబీ, 2024 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి పంటల బీమా పరిహారం ఊసే లేకుండా పోయింది. సూపర్–6లో భాగంగా రైతులకు ఏడాది అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చెల్లిస్తామని ప్రకటించిన 'కూటమి' పార్టీల నేతలు 2024–25 సంవత్సరంలో మొండి చెయ్యి చూపారు. ప్రస్తుతం అకాల వర్షాలు రైతులను ముంచాయి. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు కుదేలయ్యే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. దెబ్బతిన్న అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అకాల వర్షాలు, అధిక వర్షాలకు పంటలు దెబ్బతింటే నెల లోపే ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేది. నేడు ఆ పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కర్నూలు జిల్లాలో సగటున 13.3 మిమీ, నంద్యాల జిల్లాలో 20.1 మిమీ వర్షపాతం నమోదైంది.
- ఈ నెల 9వ తేదీ వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు గుంటూరు గ్రామీణ వ్యవసాయ వాతావరణ సేవా పథకం అధికారులు ప్రకటించారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాస్త్రవేత్త నారాయణ స్వామి తెలిపారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం



ముల్లా అజీజుల్ రహిమాన్ (ఫైల్)

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామానికి చెందిన ముల్లా అజీజుల్ రహిమాన్(28) కనిపించడం లేదని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గ్రామంలో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్న యువకుడు గురువారం ఉదయం నందికొట్కూరుకు వెళ్లొస్తానని చెప్పి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో తండ్రి మహమ్మద్‌హుసేన్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావటంతో భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ఆయన జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన కుమారుడు ఆచూకీ కనిపించడం లేదని ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగిన రైలులో చైన్‌స్నాచింగ్

వెల్దుర్తి: ఆగి ఉన్న రైలులో దొంగలు చైన్‌స్నాచింగ్ చేశారు. ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులను అపహరించి పరారయ్యారు. వివరాలు.. గురువారం సాయంత్రం చిత్తూరు నుంచి కాచిగూడకు బయలుదేరిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ క్రాసింగ్ ఉండడంతో అర్ధరాత్రి తర్వాత బోగోలు రైల్వేస్టేషన్‌లో ఆగింది. అదే రైలులో ప్రయాణిస్తున్న దుండగులు ఇదే అదునుగా భావించి ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కుని రైలు దిగి పరారయ్యారు. బాధితులు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంలో లైన్‌మన్ మృతి



కల్లుపోతుల ఈరన్న(ఫైల్)

ఆదోని అర్బన్: విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న కల్లుపోతున్న ఈరన్న(55) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందారు. ఆదోని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన కల్లుపోతుల ఈరన్న.. రాజశ్రీ హోటల్ వద్ద మరమ్మతు పనులు చేపడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఈరన్నకు భార్య నరసమ్మ, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వారికి తీరిక లేదు.. వీరికి జీతాలు రావు

- వేతనాల కోసం కేజీబీవీల్లో ఉద్యోగుల నిరీక్షణ
- గతేడాది నవంబర్‌లో నియామకాలు
- ఆప్కాస్‌లో చేర్చేందుకు జాబితా పంపిన సమగ్ర శిక్ష అధికారులు
- ఇన్‌చార్జ్ మంత్రుల ఆమోదం లేదని వెనక్కి వచ్చిన ఫైల్
- వైఎస్సార్‌సీపీ హయాంలో నియమించిన వారికి మొదటి నెల నుంచే వేతనాలు జమ



పత్తికొండ కేజీబీవీ

కర్నూలు సిటీ: హొళగుంద కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ టి.శ్రీనివాసులు గత నెలలో తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న కొందరు ఉద్యోగులు 'సార్..మాకు ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. రోజు పని చేస్తున్నా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నాం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒక్క కేజీబీవీలోనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని 55 కస్తూర్బాల్లో గతేడాది నవంబరులో నియమించిన 130 మంది టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు రావడం లేదు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి చిరుద్యోగులు తీసుకపోయినా కూడా అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఐదు నెలలుగా వారికి జీతాలు ఎందుకు రావడం లేదో తెలిసినా కూడా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వేతనాలు అందక పోవడంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. పండగలు సైతం చేసుకోలేక పోయామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన నియామకాల్లో ఉద్యోగాలు పొందిన వారికి ఎక్కడా కూడా జాప్యం లేకుండా మొదటి నెల నుంచే వేతనాలు అందుతున్నాయి. కర్నూలు జిల్లాలో 26, నంద్యాల జిల్లాలో 27 కస్తూర్బాలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు గతేడాది అక్టోబరు నెలలో నోటిఫికేషన్ ఇచ్చి..అర్హుల జాబితాను కొంత ఆలస్యంగానే ప్రకటించారు. కర్నూలు జిల్లాలో 47 మంది, నంద్యాల జిల్లాలో 83 మందిని నియమించారు. అయితే ఆ సమయంలో ఎంపికైన వారి జాబితా కలెక్టర్ ఆమోదం తీసుకుని నియామక పత్రాలను అందజేశారు. ఆ తరువాత ఎంపికైన వారి బ్యాంకు, తదితర వివరాలను సేకరించి పూర్తి వివరాలతో ఈ ఏడాది జనవరి నెలలో ఆప్కాస్‌లో వారిని చేర్చేందుకు జాబితాను పంపించారు. అయితే ఆ జాబితాకు జిల్లా ఇన్‌చార్జ్‌ల మంత్రి ఆమోదం లేక వెనక్కి పంపించేశారు. అప్పటి నుంచి సుమారుగా రెండు నెలలుగా కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ చుట్టూ సంతకాలు కోసం అధికారులు తిరుగుతున్నారు. కానీ జాబితాలపై సంతకాలు చేసేందుకు వారికి తీరిక లేదని మంత్రుల పేషీ నుంచి సమాధానాలు వస్తున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇన్‌చార్జ్ మంత్రుల ఆమోదం లేదని వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

చర్యలు తీసుకుంటున్నాం

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కొత్తగా నియమించిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు త్వరలో వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. వేతనాలు చేసేందుకు జాబితా ఆప్కాస్‌కి పంపగా, ఆ జాబితాకి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం పొందిన తరువాత జీతాలు చెల్లిస్తామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ఇన్‌చార్జ్ మంత్రి జిల్లాకు రానున్నారు. వచ్చిన తరువాత సంతకం చేయించిన వెంటనే వేతనాలు వచ్చే అవకాశం ఉంది.

– టి.శ్రీనివాసులు, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్

రైతు ఆత్మహత్యలకు ఎన్‌డీఏ సర్కారే కారణం



సమావేశంలో మాట్లాడుతున్న కేరళ వ్యవసాయ శాఖమంత్రి ప్రసాదు

కర్నూలు(సెంట్రల్): దేశంలో రైతు ఆత్మహత్యలకు ఎన్‌డీఏ సర్కార్ విధానాలే కారణమని కేరళ వ్యవసాయ శాఖమంత్రి ప్రసాదు అన్నారు. శుక్రవారం కర్నూలులోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య అధ్యక్షతన జాతీయ రైతు సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేరళ వ్యవసాయ శాఖమంత్రితో పాటు ఏపీ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాదు మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ దొడ్డిదారిలో రైతు వ్యతిరేక చట్టాల అమలుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేరళ భూసంస్కరణల్లో సీపీఐ కీలక పాత్ర పోషించిందని, మార్కెటింగ్ విధానంతో రైతులకు కేరళ ప్రభుత్వ అండగా ఉందని చెప్పారు.

- మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఏపీలో రైతుల స్థితిగతులు అగమ్యగోచరంగా ఉన్నాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. మిర్చి సాగుచేసిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం అన్యాయమన్నారు.
- ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ ఏపీలో అమల్లో ఉన్న ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేస్తోందని విమర్శించారు. ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు.
- సమావేశంలో మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సామగ్రి చోరీ కేసులో ఐదుగురు అరెస్ట్

- 1.5 టన్నుల బరువైన 240 ఇనుప రాడ్లు స్వాధీనం
- పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు



అరెస్ట్ చేసిన వారిని చూపుతున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రైల్వే ఇనుప సామగ్రిని చోరీ చేసిన కేసులు శుక్రవారం ఐదుగురి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గత నెల 31న గాజులపల్లె ఆర్ఎస్ సమీపంలో కిలో మీటర్ మేరకు రైల్వేట్రాక్‌కు సపోర్టుగా ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్‌లను తొలగించి అపహరించారు. వీటి విలువ సుమారు రూ. 1.10 లక్షలు ఉంటుంది. సైట్ ఇంజనీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం సీతారామాపురం సమీపంలో కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద అనుమానాస్పదంగా ఉన్న గోపవరం గ్రామానికి చెందిన పిన్నాపురం తిరుమలేసు, నాగసరపు అశోక్, మాచర్ల ఆదికేశవ, షేక్ సద్దాంహుసేన్, శివను అదుపులోకి విచారించగా చోరీ వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి 1.5 టన్నుల బరువున్న 240 ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిని నంద్యాల జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. మరో నిందితుడు విక్రమ్‌ను పరారీలో ఉన్నాడని, త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

బంగారు గొలుసు అపహరణ

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన కటికం అరుణకు చెందిన బంగారు గొలుసు అపహరణకు గురైందని ఎస్ఐ చిన్న పీరయ్య శుక్రవారం తెలిపారు. గ్రామ బస్ స్టాప్ వద్ద కిరాణం దుకాణంలో మహిళ కూర్చొని ఉంది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలోని 15 గ్రాముల బంగారు గొలుపు లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజన గురుకుల పరీక్ష 20వ తేదీకి వాయిదా

శ్రీశైలం: శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈనెల 5న జరగాల్సి పరీక్ష 20వ తేదీ ఆదివారానికి వాయిదా వేసినట్లు ఐటీడీఏ పీఓ వెంకట శివ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి మొత్తం 80 మంది బాలురు ఎంపిక చేయాల్సి ఉందని పేర్కొన్నారు. వివరాలకు 9490957267, 9493474176, 9882698893 సంప్రదించాలని తెలిపారు.

అవును.. వాళ్లు కాపాడారు!



గట్టిగా ప్రయత్నంచిండి..



పట్టురా పట్టు.. పైకి లాగండి..



హమ్మయ్యా.. బతికిపోయా

రోడ్లపై తిరిగే ఓ కోడెదూడ ఆహారం కోసం వెతుకుతూ ప్రమాదశాత్తు మురికి కాల్వలో చిక్కుకుంది. కాల్వ గోడలు ఎత్తుగా ఉండటంతో పైకి ఎక్కేందుకు రాత్రంతా నానా అవస్థలు పడింది. శుక్రవారం ఉదయం డ్రెయినేజీని శుభ్రపరిచేందుకు వచ్చిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కాల్వలో పడ్డ కోడెదూడను పసిగట్టారు. తాళ్ల సాయంతో అతికష్టం మీదగా దూడను రక్షించారు. కార్మికుల సాయంతో డ్రెయినేజీ నుంచి బయటపడి 'హమ్మయ్యా.. గండం గడిచింది' అని కోడెదూడ కాపాడిన వారి వైపు కృతజ్ఞతగా చూస్తూ వెళ్లిపోయింది. ఈ ఘటన కోవెలకుంట్ల పట్టణం మెయిన్ రోడ్డులోని పంచాయతీ సర్కిల్‌లో చోటు చేసుకుంది. – కోవెలకుంట్ల

కుంటలో విద్యుత్ తీగ పడి..

- గేదె, రెండు నక్కలు మృత్యువాత



నీటికుంటలో మృత్యువాత పడిన బర్రె, నక్కలు

కొత్తపల్లి: కుంటలో నీళ్లు తాగేందుకు వెళ్లి ఓ గేదె, రెండు నక్కలు మృత్యువాత పడ్డాయి. బావాపురం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన గేదె గురువారం సాయంత్రం ఇంటి నుంచి మేత మేసేందుకు పొలాల్లోకి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయాన్నే రైతు గేదె కోసం గాలిస్తుండగా గ్రామ పొలిమేరలోని కురుకుంద చెరువు అలుగు వాగులో గేదె, పక్కనే మరో రెండు నక్కలు కూడా మృత్యువాత పడినట్లు గమనించాడు. వాగులో విద్యుత్ తీగ పడి ఉండటంతో విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు భావించాడు. గురువారం సాయంత్రం మండలంలో ఈదురుగాలులతో కూడిన చిన్నపాటి వర్షం కురిసింది. ఈ ఈదురుగాలులకు పొలాల్లోని విద్యుత్ తీగ తెగి వాగులోని నీటి కుంటలో పడింది. దీంతో నీరు తాగేందుకు వెళ్లిన గేదె, నక్కలు విద్యుత్ షాక్‌తో మృత్యువాతతో చనిపోయినట్లు తెలుస్తోంది.

పిడుగు పడి ఆరు పొట్టేళ్లు మృతి



పొట్టేళ్ల కళేబరాల వద్ద సుధాకర్

చిప్పగిరి: పిడుగు పడి ఆరు పొట్టేళ్లు మృతి చెందాయి. ఈ ఘటన సంగాల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. సంగాల గ్రామానికి చెందిన జోలాపురం సుధాకర్ తన ఇంటి వెలుపల ఆరు పొట్టేళ్లను కట్టేసి ఉంచాడు. గురువారం రాత్రి పిడుగు పడటంతో అన్నీ అక్కడికక్కడే మృతిచెందాయి. జీవనాధారం కోసం పెంచుకున్న పొట్టేళ్లు మృతి చెందడంతో బాధితుడు బోరున విలపించాడు. మొత్తం రూ. లక్ష వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన షేక్ అక్బర్ మియా

కర్నూలు: పాతబస్తీలోని గడ్డా వీధిలో నివాసముంటున్న షేక్ అక్బర్ మియా (75) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన గతంలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగానే ఉంటున్నాడు. నలుగురు ఆడపిల్లలు, ఒక కొడుకు సంతానం. గురువారం కల్లూరు ఇందిరమ్మ కట్ట వద్ద సొహైల్ అనే వ్యక్తి బైక్ వెనుక కూర్చొని పాత ఈద్గా వైపు వెళ్తున్నాడు. బిస్మిల్లా హోటల్‌కు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా కుక్క అడ్డు రావడంతో సొహైల్ కుక్కను తప్పించబోయి పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ కింద పడి గాయాలకు గురయ్యాడు. బైక్ నడుపుతున్న సొహైల్‌కి స్వల్ప గాయాలు కాగా వెనుక కూర్చున్న షేక్ అక్బర్ తలకు బలమైన గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్యాజువాలిటీ వార్డులో చికిత్స పొందుతూ తెల్లవారుజామున షేక్ అక్బర్ మియా మృతిచెందారు. కుమారుడు మహబూబ్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. ప్రమాద సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్‌లో 44 మందికి ఎస్ఐలుగా అడ్‌హాక్ పదోన్నతి

- స్టేషన్లు కేటాయిస్తూ నోడల్ అధికారి ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 12 మందికి స్థానచలనం



పదోన్నతి ఎస్ఐలతో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఈఎస్ సుధీర్ బాబు

కర్నూలు: ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టులను భర్తీ చేస్తూ ఆ శాఖ నోడల్ అధికారి (డిప్యూటీ కమిషనర్) శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 29 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 15 మంది క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతి కల్పించి బదిలీల్లో భాగంగా వారికి స్టేషన్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ మహిళా ఎస్ఐలకు సంబంధించి మరో నాలుగు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వీరి సీనియారిటీ జాబితా త్వరలోనే రూపొందించి ఆయా పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తెలిపారు. పదోన్నతి పొందిన వారందరికీ శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ప్రమోషన్‌తో పాటు పోస్టింగ్ కాపీ అందజేశారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదోన్నతులు ఇలా..

పేరు	హోదా (డిజిగ్నేషన్)	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.పీరాన్‌బి	జూనియర్ అసిస్టెంట్	కర్నూలు డీసీ ఆఫీస్	రాయచోటి ఎక్సైజ్ స్టేషన్
ఎస్.సతీష్‌కుమార్	జూనియర్ అసిస్టెంట్	డీపీఈఓ, నంద్యాల	బద్వేల్ స్టేషన్
ప్రవీణ్‌కుమార్	జూనియర్ అసిస్టెంట్	డీపీఈఓ, కర్నూలు	అటాచ్డ్ డిస్టిలరీ వింగ్
ఆర్.శివప్రసాద్	జూనియర్ అసిస్టెంట్	డీసీ ఆఫీస్, కర్నూలు	పంచలింగాల చెక్‌పోస్టు
కె.రాజేష్	జూనియర్ అసిస్టెంట్	డీపీఈఓ, కర్నూలు	పత్తికొండ స్టేషన్
షేక్ రవితేజ	హెడ్‌కానిస్టేబుల్	డీపీఈఓ, పుట్టపర్తి	ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, కర్నూలు
ఎస్.వెంకటరాజు	హెడ్‌కానిస్టేబుల్	హొళగుంద చెక్‌పోస్టు	కర్నూలు స్టేషన్
ఎస్ఎండీ షరీఫ్	హెడ్‌కానిస్టేబుల్	ఆళ్లగడ్డ స్టేషన్	ఆలూరు స్టేషన్
ఎన్.రాయుడు	హెడ్‌కానిస్టేబుల్	ఎమ్మిగనూరు స్టేషన్	ఎమ్మిగనూరు స్టేషన్
విజయభాస్కర్	హెడ్‌కానిస్టేబుల్	డోన్ స్టేషన్	అటాచ్డ్ డిస్టిలరీ వింగ్
డి.శ్రీనివాసులు	హెడ్‌కానిస్టేబుల్	పత్తికొండ స్టేషన్	నందికొట్కూరు స్టేషన్
కె.నాగరాజు	హెడ్‌కానిస్టేబుల్	కోసిగి స్టేషన్	బనగానపల్లె స్టేషన్
కె.నాగేంద్ర	హెడ్‌కానిస్టేబుల్	ఆళ్లగడ్డ స్టేషన్	కోసిగి స్టేషన్



అరటి మొక్కలకు ఈతాకు రక్ష

మండే ఎండాకాలంలో అరటి మొక్కలకు ఈతాకులే రక్షణగా నిలుస్తున్నాయి. రైతులు అరటి పిలకలను నాటినప్పుడు నుంచి వాటిని కాపాడుకునేందుకు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా అరటి పిలకలను కాపాడునేందుకు ఈతాకులను నాటుతున్నారు. ఈ విధంగా నాటడం వల్ల ఎండ నుంచి మొక్కకు రక్షణ ఉంటుందని బాపనదొడ్డి గ్రామ రైతులు తెలుపుతున్నారు. – కృష్ణగిరి

సిల్వర్ జూబ్లీ ప్రవేశాలకు 6 నుంచి దరఖాస్తులు



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు సిల్వర్‌సెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్.కుమార్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఏపీ విభజన తరువాత రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మాత్రమే ఈ ఏడాది నుంచి కళాశాలలో ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 6 నుంచి 30వ తేదిలోపు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 18న అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. 280 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా అర్హత పరీక్ష నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు https://cuklap.ac.in,https://www.sjgckurnool.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు 9059305168ను సంప్రదించవచ్చన్నారు. విలేకరుల సమావేశంలో సిల్వర్ సెట్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ వాహిద్, తదితరులు పాల్గొన్నారు.